

అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....


# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 278 ఎడిటర్: కె.యువరాజ్ ఆదివారం 19-7-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు


## నోటిఫికేషన్లు ఇచ్చారు.. లీకేజీలతో అమ్ముకున్నారు



**- ప్రశ్న పత్రాలను అమ్మి వందల కోట్లు సంపాదించారు - 'అందెశ్రీ స్మృతి వనం' భూమి పూజ కార్యక్రమంలో సీఎం**

**మేడ్చల్, జులై 18 (వన్‌నేషన్):** "మేక తోలు కప్పుకొన్న ఓ తోడేలు ఇవాళ మాట్లాడుతోంది. మీరు నోటిఫికేషన్లు ఇస్తే మా ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చిందని నిస్సిగ్గుగా నడిబజార్లలో మాట్లాడుతున్నావు కదా? ఈరోజు నేను ఒక్కమాట అడుగుతున్నా.. నోటిఫికేషన్లు ఇచ్చి.. ప్రశ్న పత్రాలను జిరాక్స్ సెంటర్లలో పల్లీ బఠాణీల మాదిరిగా అమ్ముకుని వందలాది కోట్ల రూపాయలు సంపాదించుకున్నావు తప్పితే.. ఆ పరీక్షలు పూర్తి చేసి పిల్లలకు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలనే ఆలోచన నీ కుటుంబానికి వచ్చిందా? నిరుద్యోగులు, ఉద్యోగ నియామకాల గురించి ఒక్క రోజైనా ఆలోచించారా? వారిని అసలు మనుషుల్లా చూశారా? మానవీయ కోణంలో చూశారా?" అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆనాడు కవితను, వినోద్‌ను ప్రజలు తిరస్కరిస్తే వెంటనే ఉద్యోగాలు ఇచ్చారని, కానీ, తెలంగాణ బిడ్డల

4లో

## వైసీపీ వద్దే వద్దు



**- అధికారం లేకున్నా రప్పా, రప్పా అంటున్నారు - చెత్త సేకరణకు 1104 వాహనాలు సమకూరుస్తాం - చెత్త నుంచి విద్యుత్ తయారీకి 8 ప్లాంట్‌లు నిర్మిస్తాం - గుడివాడ స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్రలో సీఎం చంద్రబాబు**

**గుడివాడ, జులై 18 (వన్‌నేషన్):** గొడ్డలి పార్టీని శాశ్వతంగా రాజకీయాల నుంచి నిర్మూలించాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. అధికారం లేనప్పుడే వైసీపీ నాయకులు రప్పా, రప్పా అని అంటున్నారని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పొట్టేళ్లను కోసి రక్తతర్పణం చేస్తున్నారని విమర్శించారు. గొడ్డలి పార్టీ అధికారంలోకి వస్తే పరిస్థితులు ఎలా ఉంటాయో ప్రజలు ఊహించుకోవాలన్నారు. బాబాయ్‌ని గొడ్డలితో నరికి చంపి, ఆ తరువాత గుండె నొప్పి అని ప్రచారం చేశారని అన్నారు. ఆ నెపాన్ని తనపై నెట్టి నారాసుర రక్తచరిత్ర పేరుతో దుష్ప్రచారం చేశారని విమర్శించారు. ఇప్పుడు కూటమి పాలనలో ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని అన్నారు. శనివారం కృష్ణా జిల్లా గుడివాడ నియోజవర్గంలో స్వచ్ఛ ఆంధ్రా-స్వర్ణ ఆంధ్రా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయనమాట్లాడారు. "గత సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు చెత్తను శుభ్రం చేశారు. బూతులు తిట్టిన నోళ్లను ఓట్లతో కడిగేశారు. రాజకీయాల్లో ఇంకా క్రిమినల్స్ కొనసాగుతున్నారు. కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారు. సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని అసభ్యపోస్టులు పెడుతున్నారు. ప్రజల జీవితాలకు ఆటంకాలు కలిగిస్తున్నారు. అదేమని అడిగితే భావప్రకటనా స్వేచ్ఛ అని అంటున్నారు. ఇలాంటి వారిని సహించేది లేదు. స్వచ్ఛమైన రాజకీయాలు, స్వచ్ఛమైన ప్రజాప్రతినిధులు, స్వాభిమానం అనే అంశాలను ఆధారంగా చేసుకుని టీడీపీ గత 40 సంవత్సరాలకు పైగా కొనసాగుతోంది" అని అన్నారు. ఈ నెల

4లో

## వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్' బిల్లును పార్లమెంటులో వ్యతిరేకించాలి

**ఎంపీ ఈటెల రాజేందర్‌కు ఏఐఎస్ఎఫ్ వినతి**



**మేడ్చల్ / జులై 18 /వన్ నేషన్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్ట బోయే 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్' ( వి బి ఎస్ ఏ) బిల్లు 2025 రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని, పేద విద్యార్థుల హక్కులను కాలరాసేలా ఉన్న ఈ బిల్లును పార్లమెంటులో అడ్డుకోవాలని కోరుతూ మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌కు అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి వినతి పత్రం అందజేసింది. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొని, బిల్లు వల్ల విద్యా రంగానికి వాటిల్లే నష్టాలను ఎంపీకి వివరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్ మాట్లాడు తూ, విద్యా రంగాన్ని కేంద్రం తన గుప్పిట్లోకి తీసుకోవడా నికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ఈ బిల్లును తీసుకొస్తున్నారని విమర్శిం చారు. ప్రస్తుతం ఉన్న ఉన్నత విద్యా నియంత్రణ సంస్థలైన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యు జి సి), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ( ఏఐసిటిఈ), మరియు నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ ( ఎన్ సి టి ఈ) స్థానంలో వి బి ఎస్ ఏ పేరుతో ఒకే సర్వోన్నత సంస్థను ఏర్పాటు చేయడం ఫెడరల్ వ్యవస్థకు గొడ్డలిపెట్టు అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ బిల్లు ఆమోదం పొందితే విద్యా నియంత్రణ సంస్థలు ప్రభుత్వంలో కేవలం ఒక విభాగంలా మారిపోతాయ ని, దీనివల్ల విశ్వవిద్యాల యాల స్వయం ప్రతిపత్తి పూర్తిగా దెబ్బతింటుందని అన్వర్ పేర్కొన్నారు. అలాగే, ఐఐటీ (ఐఐటీ ), ఐఐఎం (ఐఐఎం ), ఎన్ఐటీ (నిట్ ), ఐఐఎస్ఈఆర్ ( ఐ ఎస్ సి ఆర్) వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థలను సైతం వి బి ఎస్ ఏ నియంత్రణలోకి తీసుకురావడం విద్యా రంగానికి వినాశకరమని ఆయన అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రజాస్వామ్య హక్కులపై ప్రభావం చూపే ఈ ప్రతిపాదిత బిల్లును పార్లమెంటులో చర్చకు వచ్చినప్పుడు తీవ్రంగా వ్యతిరేకించాలని, ప్రభుత్వ విద్యారంగ బలోపేతం కోసం ఎంపీ తన గళాన్ని వినిపించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కృష్ణ, సాయి, అరవింద్, మధు తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లిలో ఘనంగా ఆర్ఎస్ బ్రదర్స్ ప్రారంభోత్సవం

**- ప్రారంభోత్సవానికి హీరో అక్కినేని నాగచైతన్య దంపతులు**



**మేడిపల్లి /జూలై 18 / వన్ నేషన్:** మేడిపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఎస్ బ్రదర్స్ షోరూమ్ ప్రారంభోత్సవం హీరో అక్కినేని నాగచైతన్య దంపతుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్లు సీసా వెంకటేష్ గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, మోదు గు మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై షోరూ మ్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు షోరూమ్ నిర్వాహకులకు శుభాకాంక్ష లు తెలియజేస్తూ, స్థానికం గా కొత్త వ్యాపార సంస్థలు ప్రారంభం కావడం ప్రాంత అభివృద్ధికి, ఉపాధి అవకా శాల పెరుగుదలకు దోహద పడుతుందని పేర్కొన్నారు. వ్యాపార సంస్థ ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు, మెరుగైన సేవలు అందిస్తూ విజయవంతంగా కొనసాగా లని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్తలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమా నులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని




అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా పనిచేసే విలేకరులు కావలెను.

9948222240

# గుండెకో వ్యధ' జాతీయ కవితల పోటీలో డా. పెరుక రాజు విజేత



హైదరాబాద్, జులై 18 (వన్‌నేషన్): తెలుగు భాషా సంరక్షణను ధ్యేయంగా చేసుకుని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు కవులను ఒకే వేదికపైకి తీసుకువస్తూ అక్షరాలకు నీరాజనం పలుకుతున్న విశ్వ సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన “గుండెకో వ్యధ” జాతీయ కవితల పోటీలో ప్రముఖ జాతీయ కవి, రచయిత, అనువాదకుడు డా. పెరుక రాజు విజేతగా నిలిచారు.డా. పెరుక రాజు కలం నుంచి జాలువారిన ప్రతి అక్షరం ఒక గుండె చప్పుడు. ప్రతి కవిత ఒక మనిషి అంతరంగానికి అద్దం. లోకంలో ఎన్నో రకాల మనుషులు, ఎన్నెన్నో మనస్తత్వాలు ఉంటాయి. కొందరి హృదయాల్లో ఆనందపు అలలు ఎగసిపడితే, మరికొందరి అంతరంగంలో ఎవరికీ చెప్పుకోలేని వ్యథల సముద్రం అలముకుంటుంది. ప్రతి మనిషి వెనుక ఒక కథ ఉంటుంది; ప్రతి కథ వెనుక ఒక వ్యథ దాగి ఉంటుంది.ఆ వ్యథ కాలం మిగిల్చిన తీరని గాయం కావచ్చు, సమాజం వినని ఆర్తనాదం కావచ్చు, లేక వ్యవస్థను నిలదీసే మౌన ప్రశ్న కావచ్చు. సమాజంలోనూ, మనుషుల మనసుల్లోనూ దాగి ఉన్న అలాంటి అనేక అంతర్మథనాలను, కంటికి కనిపించని వ్యక్తిగత, సామాజిక గాయాలను తన సృజనాత్మక దృష్టితో అక్షరరూపంలో ఆవిష్కరించిన డా. పెరుక రాజు కవిత న్యాయనిర్ణేతలను విశేషంగా ఆకట్టుకొని విజేతగా నిలిపింది.

## భారతదేశంలో సమతుల్య ప్రాంతీయ అభివృద్ధిని ప్రోత్సహించడానికి

# మహానగరేతర ప్రాంతాల్లో పారిశ్రామిక పునరుజ్జీవనం

హైదరాబాద్, జులై 18 (వన్‌నేషన్): భారతదేశంలో సమతుల్య ప్రాంతీయ అభివృద్ధిని ప్రోత్సహించడానికి మహానగరేతర ప్రాంతాల్లో పారిశ్రామిక పునరుజ్జీవనం (Industrial Revitalisation) ఒక ముఖ్యమైన వ్యూహంగా అభివృద్ధి చెందింది. పరిశ్రమలను కేవలం మహానగరాల్లోనే కేంద్రీకరించకుండా, ప్రాంతీయ అసమానతలను తగ్గించడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం, స్థానిక ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయడం వంటి లక్ష్యాలతో ప్రభుత్వం చిన్న పట్టణాలు మరియు అర్ధపట్టణ ప్రాంతాల్లో పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఎక్కువ దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలో, ప్రధాన మంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అప్పారెల్ (PM MITRA) పార్కుల పథకం అత్యంత ప్రాముఖ్యమైన కార్యక్రమాలలో ఒకటిగా నిలిచింది. తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్‌లో PM MITRA టెక్స్‌టైల్ పార్క్ స్థాపన, మహానగరేతర ప్రాంతాల్లో పారిశ్రామికీకరణకు సంబంధించిన రాజకీయ ఆర్థిక వ్యవస్థ (Political Economy) ను అర్థం చేసుకోవడానికి ఒక ముఖ్యమైన అధ్యయనంగా పరిగణించబడుతుంది. భారత ప్రభుత్వం ఎంపిక చేసిన రాష్ట్రాల్లో సమగ్ర వస్త్ర తయారీ పారిశ్రామిక వ్యవస్థలను (Integrated Textile Manufacturing Ecosystems) ఏర్పాటు చేయడానికి PM MITRA పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం “వ్యవసాయం నుంచి నూలు వరకు, నూలు నుంచి కర్మాగారం వరకు, కర్మాగారం నుంచి ఫ్యాషన్ వరకు, ఫ్యాషన్ నుంచి విదేశీ మార్కెట్ల వరకు” అనే నమూనాను ప్రోత్సహిస్తుంది. అంటే, వస్త్ర పరిశ్రమకు సంబంధించిన మొత్తం విలువ శ్రేణిని (Value Chain) ఒకే పారిశ్రామిక వ్యవస్థలో సమగ్రంగా అనుసంధానించడం ఈ పథక ప్రధాన లక్ష్యం.

### ఈ పథక ముఖ్య లక్ష్యాలు:

భారీ స్థాయిలో వస్త్ర తయారీని ప్రోత్సహించడం. ప్రపంచ వస్త్ర మార్కెట్‌లో భారతదేశ పోటీతత్వాన్ని పెంపొందించడం. దేశీయ మరియు విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం. ముఖ్యంగా మహిళలకు ఉపాధి అవకాశాలను సృష్టించడం. సమగ్ర మౌలిక సదుపాయాల ద్వారా ఎగుమతులకు మద్దతు ఇవ్వడం. రవాణా (లాజిస్టిక్స్) మరియు ఉత్పత్తి వ్యయాలను తగ్గించడం. ఈ పార్కులు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఉమ్మడి ప్రాసెసింగ్ సౌకర్యాలు, పరిశోధనా కేంద్రాలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలు, లాజిస్టిక్స్ కేంద్రాలు మరియు పర్యావరణానికి అనుకూలమైన స్థిరమైన నిర్వహణ వ్యవస్థలతో రూపకల్పన చేయబడుతున్నాయి.



# ప్రముఖ కవి శ్రీ అందెశ్రీ గారి జయంతి

హైదరాబాద్, జులై 18 (వన్‌నేషన్): తెలంగాణ సంస్కృతిని తన కలంతో ప్రపంచానికి చాటిన ప్రముఖ కవి శ్రీ అందెశ్రీ గారి జయంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, అరవింద్ కుమార్ గౌడ్ లు ఘన నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు. “ జయ జయహే తెలంగాణ “ గీతం ఆయన సాహిత్య సేవకు ఒక నిదర్శనం. తెలంగాణ ఆత్మను ఆవిష్కరించే ఆయన సాహిత్యం చిరస్మరణీయమని, భావితరాలకు స్ఫూర్తి గా నిలుస్తుందని తెలిపారు.

– తెలుగుదేశం ప్రకాష్ రెడ్డి

## రవీంద్రభారతిలో శృతిలయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో

# ప్రముఖ కవి డాక్టర్ సి నారాయణ రెడ్డి గారి జన్మదినం



హైదరాబాద్, జులై 18 (వన్‌నేషన్): రవీంద్రభారతిలో శృతిలయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ సి నారాయణ రెడ్డి గారి జన్మదిన సందర్భంగా నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి గారిని సి.నారాయణరెడ్డి పాలనా ప్రతిభ పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లు రవి గారి ఆత్మీయ బంధువు ప్రముఖ వ్యాపారవేత్త నార్మల్ల భాస్కర్ గారు గజమాల మరియు కాంగ్రెస్ రంగు టోపీ తో ప్రత్యేకంగా సన్మానించారు. ఎంపీ మల్లు రవి గారు మాట్లాడుతూ రవీంద్ర భారతి లాంటి ఆడిటోరియం లో ప్రతి జిల్లాలో నిర్మించాలని తెలిపారు. శృతిలాయ ఆమని గారి గీతాలను ప్రత్యేకంగా విని ఆస్వాదించారు.

# నమస్తే ఎమ్మిగనూరు - ప్రజా సమస్యలపై పోరుబాట

### మల్కాపురం కన్నీటి గాధ విన్న రాజీవ్ రెడ్డి... ప్రజల బాధలు చూసి చలించిపోయిన నాయకుడు..!





ఎమ్మిగనూరు జూలై 18 MD యూసుఫ్ (వన్ నేషన్) : ప్రజల సమస్యలే తన రాజకీయానికి పునాది అని నమ్ముతున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ ఎర్రకోట రాజీవ్ రెడ్డి గారు, “నమస్తే ఎమ్మిగనూరు -- ప్రజా సమస్యలపై పోరుబాట” కార్యక్రమం రెండో రోజు ఎమ్మిగనూరు మండలం మల్కాపురం గ్రామంలో పర్యటించారు.

లిముందుగా గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన రాజీవ్ రెడ్డి గారు, అనంతరం సెయింట్ థామస్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని గ్రామ ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థించారు. అయితే దేవాలయాలు, ప్రార్థనా మందిరాల్లో ప్రశాంతత కనిపించినా... గ్రామ వీధుల్లో మాత్రం ప్రజల కష్టాలు, కన్నీళ్లు, ఆవేదన రాజీవ్ రెడ్డి గారిని కలచివేశాయి. ముఖ్యంగా స్థానిక ఎస్సీ కాలనీలో పరిస్థితులు చూసిన రాజీవ్ రెడ్డి గారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా మురుగునీరు. ఎక్కడ చూసినా దుర్వాసన. ప్రతి వీధిలో దోమల బెడద. ప్రతి ఇంటిలో అనారోగ్య భయం. ఇదే మల్కాపురం ఎస్సీ కాలనీ పరిస్థితి అని స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. “సార్... వర్షం పడితే మురుగునీరు మా ఇళ్లలోకి వస్తుంది... పిల్లలు జ్వరాలతో బాధపడుతున్నారు... ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు...అంటూ మహిళలు తమ ఆవేదనను రాజీవ్ రెడ్డి గారి ముందు వ్యక్తం చేశారు. ప్రజల బాధలను విన్న రాజీవ్ రెడ్డి గారు భావోద్వేగానికి గురయ్యారు. ప్రజలు నివసించే ప్రాంతాలు ఇలా ఉంటే అధికార యంత్రాంగం ఏమి చేస్తోందని ప్రశ్నించారు. గ్రామమంతా పర్యటించిన అనంతరం ఆయన మాట్లాడుతూ “సోషల్ మీడియాలో అభివృద్ధి కథలు చెప్పడం సులభం... కానీ మల్కాపురం వీధుల్లోకి వచ్చి ప్రజల బాధలు చూడగల ధైర్యం కూటమి ప్రభుత్వ నాయకులకు ఉందా?” అని ప్రశ్నించారు.

“రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోంది... డ్రైనేజీలు మూసుకుపోయాయి... తాగునీటి సమస్య వేధిస్తోంది... పెన్షన్ల కోసం వృద్ధులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు... ఇదేనా మీ రెండేళ్ల పాలన?” అంటూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు గ్రామ ప్రజల్లో కొత్త నమ్మకాన్ని నింపాయి. ప్రజల సమస్యలు ముఖ్యమా...? లేక రాజకీయ నాయకుల మెప్పు ముఖ్యమా...? మీరు ప్రభుత్వ ఉద్యోగులు... ప్రజలకు సేవ చేయడానికి జీతాలు తీసుకుంటున్నారు. ప్రజలకు సమస్యగా మారకండి... సమస్యలకు పరిష్కారంగా నిలవండి.” అంటూ అధికారులను గట్టిగా హెచ్చరిం చారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని పరిశీలించిన రాజీవ్ రెడ్డి గారు అక్కడి పరిస్థితులు చూసి ఆశ్చర్యపోయారు. పగిలిపోయిన కిటికీలు... వర్షపు నీటితో నిండిపోయిన గదులు... నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ ఆస్తులు చూసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రజలకు సేవలు అందించే సచివాలయానికే ఈ దుస్థితి ఉంటే... గ్రామ ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు అని వ్యాఖ్యానించారు. గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ రాజీవ్ రెడ్డి గారు భావోద్వేగంతో మాట్లాడుతూ మీ కష్టాలు చూస్తుంటే బాధగా ఉంది... మీ బాధలు నా బాధలు... మీ సమస్యలు నా సమస్యలు... అధికారంలో ఉన్నవారు చూడని కష్టాలను నేను చూస్తున్నాను... వినని గోడును నేను వింటున్నాను. నమస్తే ఎమ్మిగనూరు కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామానికి వస్తాను... ప్రతి ఇంటి తలుపు తడతాను... మీ కోసం ఎంతవరకైనా పోరాడుతాను.” అని హామీ ఇచ్చారు. అలాగే గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని గుర్తు చేస్తూ... “వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా చూసారు. ప్రతి కుటుంబానికి పెద్దకొడుకులా అండగా నిలిచారు. నేడు ప్రజలు ఆ పాలనను ఎందుకు గుర్తు చేసుకుంటున్నారో మల్కాపురం పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది.” అని అన్నారు. ఈ రోజు మీ కన్నీళ్లు చూశాను... మీ బాధలు విన్నాను... మీ సమస్యలకు న్యాయం జరిగే వరకు మీతోనే ఉంటాను. 2029లో ప్రజల ప్రభుత్వం తిరిగి రావాలి. ప్రజల పాలన మళ్లీ స్థాపించాలి. అదే మన అందరి లక్ష్యం.” అని పిలుపునిచ్చారు. మల్కాపురం గ్రామంలో జరిగిన ఈ పర్యటన కేవలం రాజకీయ కార్యక్రమం కాదు... ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకుని వారి పక్షాన నిలబడిన ఒక ప్రజానాయకుడి బాధ్యతాయుతమైన అడుగుగా గ్రామ ప్రజలు అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం గ్రామ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ ఆకస్మిక దాడులు..

### - రూ.1.18 లక్షల నగదు స్వాధీనం



ఆదోని: జూలై 18:. డి కాసిం (వన్ నేషన్): ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. రైతుల నుంచి అందిన అవినీతి ఫిర్యాదుల నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.ఏసీబీ డీఎస్పీ సీతారామారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సోదాల్లో కార్యాలయంలోని పలు రికార్డులు,ఇటీవల జరిగిన లావాదేవీలకు సంబంధించిన పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.అలాగే కార్యాలయ సిబ్బందిని ప్రశ్నించి వివిధ అంశాలపై వివరాలు సేకరించారు.సోదాల సందర్భంగా కార్యాలయంలో రూ.1,18,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ సీతారామారావు వెల్లడించారు.స్వాధీనం చేసుకున్న నగదుకు సంబంధించిన ఆధారాలు,దాని మూలం ఏమిటనే అంశంపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.ఈ దాడులకు సంబంధించిన పూర్తి వివరాలు, నగదు స్వాధీనంపై తుది నిర్ధారణతో పాటు తదుపరి చర్యలపై ఏసీబీ అధికారులు అధికారిక ప్రకటన విడుదల చేయాల్సి ఉంది.



## హెచ్ ఎస్ సి యూనివర్సిటీ ఆధ్వర్యంలో
# ఐకానిక్ ఇంటర్నేషనల్ అవార్డ్స్ అందుకున్న ప్రముఖులు



**హైదరాబాద్, జులై 18 (వన్‌నేషన్):** సికింద్రాబాద్ హంశ్రీ బిల్డింగ్ లోని ఫోర్త్ ఫ్లోర్ లో హోలీ స్పిరిట్ క్రిస్టియన్ అసోసియేషన్ యూనివర్సిటీ (HSCU) ఫౌండర్ డైరెక్టర్ బిషప్ డాక్టర్ ఆనంద్ కుమార్, బిషప్ డాక్టర్ భాస్కర్ రెడ్డి, బిషప్ డాక్టర్ గోన తిలీఫ్, డాక్టర్ ఎస్ అబ్రహం ,ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ గోవింద్ ఆధ్వర్యంలో సమాజంలోని వివిధ రంగాలకు చెందిన వారి వారి విభాగాలలో సామాజిక సేవ ఇంకా సమాజ శ్రేయస్సు ఆశించే అన్ని రంగాల ప్రముఖులను గుర్తించి ఐకానిక్ ఇంటర్నేషనల్ అవార్డు, డాక్టరేట్స్ ఇంకా వివిధ రంగాలలో కోర్సెస్ పూర్తి చేసిన విద్యార్థులకు బిటిహెచ్ ,ఎంటిహెచ్, సర్టిఫికెట్లు ప్రధానం చేయడం జరిగింది

హెచ్ ఎస్ సి యూనివర్సిటీ డైరెక్టర్ బిషప్ డాక్టర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ అందరికీ ఉపయోగపడే స్పోకెన్ ఇంగ్లీష్ సైకాలజీ కోర్సు లను ఆన్లైన్ ద్వారా బోధించి భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా ఈ యూనివర్సిటీ ఉంటుందని తెలియజేశారు ఈ యూనివర్సిటీ స్థాపించి 10 సంవత్సరాలు అవుతుందని ఇప్పటివరకు సుమారుగా 7000 మంది స్టూడెంట్స్ కి కోర్స్ కంప్లీట్ చేసి సర్టిఫికెట్స్ ప్రధానోస్తం జరిగిందని ముందు ముందు ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వంతోపాటుగా సమాజంలోని ప్రముఖులు వారి సహాయ సహకారాలు అందిస్తే భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేస్తానమని తెలియజేశారు ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ముఖ్య అతిథులతో పాటుగా ఎన్నో సంవత్సరాలుగా సోషల్ సర్వీస్ చేస్తున్నటువంటి డాక్టర్ ఖాసిం కు డాక్టర్ రేట్ ప్రధానం చేయడం జరిగింది . సమాజంలోని సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకుంటూనకొంతమంది ప్రముఖులకు ఏ విజయరాయ్,ఏ జయమని పాల్ ,తో పాటుగా ఐకాన్ ఇంటర్నేషనల్ అవార్డ్స్ స్మిత కు ఇంకా ప్రముఖులకు అవార్డ్స్ సర్టిఫికెట్స్ అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో హెచ్ ఎస్ సి యూనివర్సిటీ కర్నాటక కోఆర్డినేటర్ ఎం సునందమ్మ మాధవి లత ,కే హారిక, అరుణిమణి ,ఈస్టర్ ,శ్రీ లలిత కుమారి డాక్టర్ మోసేజ్, రియల్ ఎస్టేట్ నలిని. యూనివర్సల్ బుక్ ఆఫ్ గోల్డెన్ రికార్డ్ మౌనిక, లావణ్య సింగర్ ఆర్గనైజర్ స్వర శ్రీ డాక్టర్ కొండలరావు తదితరులు పాల్గొనీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# నిధానపల్లిలో భూముల రీసర్వే కార్యక్రమం నిర్వహణ



**యాదాద్రి జిల్లా : రామన్నపేట జూలై 18 (వన్ నేషన్):** రామన్నపేట మండలం నిధానపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని మండల తహసీల్దార్ (ఎమ్మార్వో) లాల్ బహదూర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నారాపాక మాధవి యాదయ్య మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భూముల సరిహద్దులను ఖచ్చితంగా నిర్ధారించడం, భూ రికార్డులను పారదర్శకంగా రూపొందించడం ఈ రీ-సర్వే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రీ-సర్వే ప్రక్రియ పూర్తయితే భూ వివాదాలు తగ్గడంతో పాటు ప్రతి భూ యజమానికి స్పష్టమైన హక్కుల నమోదు జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులు, భూ యజమానులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు తదితర భూ పత్రాలతో సర్వే బృందానికి సహకరించాలని సూచించారు. సర్వే అనంతరం ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు అవసరమైతే నిర్ణీత గడువులో సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. ప్రజలకు ఖచ్చితమైన, పారదర్శకమైన భూ రికార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది శోభ, వెంకటేశ్వర్లు, స్వప్న, లక్ష్మీదేవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుత్తా నర్సిరెడ్డి, సింగిరెడ్డి మల్లారెడ్డి, రామన్నపేట పోలీసు సిబ్బంది, ఉపసర్పంచ్ కొండ అండాలు మల్లయ్య, వార్డు సభ్యులు బాషమల్ల అనిత, సంతోష్,వంగాల పూజిత,ఏకుల మల్లేష్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## "నమస్తే ఎమ్మిగనూరు -- ప్రజా సమస్యలపై పోరు"
# కార్యక్రమంపై సమీక్షా సమావేశం



**ఎమ్మిగనూరు జూలై 18 (వన్ నేషన్)** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ ఎర్రకోట రాజీవ్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణ మాజీ కౌన్సిలర్లు, వార్డ్ ఇంచార్జ్‌లతో "నమస్తే ఎమ్మిగనూరు -- ప్రజా సమస్యలపై పోరు" కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ రెడ్డి గారు మాట్లాడుతూ, పట్టణంలోని ప్రతి వార్డులో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని నాయకులకు పిలుపునిచ్చారు. ప్రతి వార్డులో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వారి వద్దకే వెళ్లి పరిష్కారం కోసం పోరాడతామని తెలిపారు. అలాగే, కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై ప్రజలకు వాస్తవాలను వివరించి, వారిలో అవగాహన కల్పించడమే "నమస్తే ఎమ్మిగనూరు -- ప్రజా సమస్యలపై పోరు" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని రాజీవ్ రెడ్డి గారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పట్టణ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, వార్డ్ ఇంచార్జ్‌లు మరియు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## బల్కంపేట ఎల్లమ్మ తల్లి ఉత్సవాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన
# ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



**సనత్ నగర్, జూలై 18(వన్ నేషన్):** శ్రీ బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం. శనివారం మాజీ మంత్రివర్యులు, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్. ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న శ్రీ బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం, 22వ తేదీన జరగనున్న రథోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్, భద్రత తదితర ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## భారతీయ కుటుంబ వ్యవస్థకు ప్రత్యేకగా
# తమ్మినీడి దంపతుల 50వ వివాహ మహోత్సవం




**కూకట్‌పల్లి ప్రతినిధి, జులై 18 (వన్‌నేషన్):** ఆప్తమిత్రుడు, సోదర సమానుడు తమ్మినీడి సూర్య చంద్రశేఖర్ "మాతాపితలు" తమ్మినీడి రామలింగేశ్వర రావు తమ్మినీడి సూర్య కుమారి వివాహబంధంలోకి అడుగుపెట్టి 50 వసంతాలైన సందర్భంగా 'KPHB 9వ ఫేస్ వినాయక మండపం" నందు నిర్వహించిన లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణోత్సవం లో పాల్గొని, పెద్దలు తమ్మినీడి రామలింగేశ్వర రావు ని తమ్మినీడి సూర్య కుమారిని పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపి వారిరువురి ఆశీర్వచనాలు తీసుకోవడం జరిగింది. ఇటువంటి స్వర్ణోత్సవ వివాహ వేడుకలు జరగడం నేటి యువ సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తుందని, భారతీయ కుటుంబ వ్యవస్థ పటిష్టత తెలుపుతుందని ఈ సందర్భంగా సంతోషాన్ని వ్యక్తపరచడమైనది. మనుమలు, మనుమరాలు, తమ్మినీడి-చిలుకూరి సోదర సోదరీమణుల సమక్షంలో ఈ వేడుక నిర్వహించిన వారి కుమారులు తమ్మినీడి సూర్య చంద్రశేఖర్, తమ్మినీడి సత్యనారాయణ ( సతీష్ ) దంపతులను మరియు కుటుంబ సభ్యులను అభినందించడమైనది పెద్ది హేమలత కిషోర్.

# నిరాడంబర జీవనం, మానవత్వానికి ప్రతీక పి వెంకయ్య
## -ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు




**కూకట్‌పల్లి ప్రతినిధి, జులై 18 (వన్‌నేషన్):** కె పి హెచ్ బి కాలనీ సీనియర్ నాయకుడు పి.వి. రమణ తండ్రి, పి. వెంకయ్య పరమపదించారు. ఈ విషయం తెలియగానే కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బి ఆర్ యస్ పార్టీ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, పగడాల బాబూరావు వారి నివాసానికి చేరుకుని ఆయన పార్థివదేహానికి అంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిరాడంబర జీవనం, మంచితనం, మానవత్వం, కుటుంబం పట్ల ఆయన చూపిన ప్రేమ ఎల్లప్పుడూ అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి అని అన్నారు.

# రూ.2.60 కోట్ల వ్యయంతో బాక్స్ డ్రెయిన్ నిర్మాణం
## పనులను పరిశీలించిన వినాయక్ నగర్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి



**మల్కాజిగిరి, జులై 18 (వన్‌నేషన్):** నూతనంగా ఏర్పడిన కాకతీయనగర్ డివిజన్ పరిధిలోని రేణుకానగర్‌లో సుమారు రూ. 2.60 కోట్ల వ్యయంతో నిర్మించిన బాక్స్ డ్రెయిన్ పనులను వినాయక్ నగర్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్న క్రమంలో తలెత్తిన స్థానిక వివాదాన్ని ఆమె పరిష్కరించారు. పరిశీలన సందర్భంగా ఒక విద్యుత్ స్తంభం ఇంటి గోడను ఆనుకుని ఉండటంతో స్థానికులు వ్యక్తం చేసిన సమస్యను వెంటనే విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల భద్రత దృష్ట్యా మరో అదనపు విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను కోరగా వారు సానుకూలంగా స్పందించారు. అలాగే బాక్స్ డ్రెయిన్ నిర్మాణ సమయంలో స్థానభ్రంశం చెందిన తాగునీటి పైప్‌లైన్ విషయంపై వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ సునీల్‌తో క్యానం రాజ్యలక్ష్మి ఫోన్‌లో మాట్లాడారు. పైప్‌లైన్‌ను భూగర్భంలో ఏర్పాటు చేస్తే ఇంజినీరింగ్ శాఖ రహదారి పునరుద్ధరణ పనులను వేగంగా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని ఆమె సూచించారు. దీనిపై స్పందించిన జీఎం సునీల్, వారం రోజుల్లోపు పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి కావడానికి కృషి చేస్తున్నట్లు క్యానం రాజ్యలక్ష్మి తెలిపారు.

## విభిన్న కళాకృతులతో ఏర్పాటు చేసిన కేశవ్ రావు రూపొందించిన

# "శివ-పార్వతి" కాంస్య శిల్పం ప్రత్యేక ఆకర్షణ



**హైదరాబాద్, జులై 18 (వన్‌నేషన్):** హైదరాబాద్‌కు చెందిన శిల్పి, విగ్రహశాల వ్యవస్థాపకుడు కేశవ్ రావు గోలి, "పర్స్పెక్టివ్స్ – డిఫరెంట్ మైండ్స్, డైవర్స్ విజన్స్, వన్ కాన్వాస్" పేరుతో నిర్వహిస్తున్న గ్రూప్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో పాల్గొంటున్నారు. 50 మంది కళాకారుల విభిన్న కళాకృతులతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో కేశవ్ రావు రూపొందించిన "శివ-పార్వతి" కాంస్య శిల్పం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. నందిపై శివపార్వతులు ప్రయాణిస్తున్న దృశ్యాన్ని ఆధునిక శిల్పశైలిలో ఆవిష్కరించిన ఈ కళాఖండం 16 అంగుళాల ఎత్తు, 17 అంగుళాల వెడల్పుతో రూపొందించబడింది. శిల్పంలోని చలన భావం, శివపార్వతుల అనుబంధం, నంది ఆకృతి, ఆకుపచ్చ-బంగారు వర్ణ సమ్మేళనం ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. సాంప్రదాయ భారతీయ శిల్పకళను ఆధునిక కళాదృష్టితో సమన్వయం చేస్తూ కేశవ్ రావు గోలి విభిన్న పరిమాణాల్లో శిల్పాలు, విగ్రహాలను రూపొందిస్తున్నారు. కాంస్యం, ఫైబర్ తదితర మాధ్యమాల్లో ఆయన కళాకృతులను సృష్టిస్తున్నారు. ఈ ప్రదర్శన 2026 జులై 17 నుంచి 20 వరకు, ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు, హైదరాబాద్ మాదాపూర్‌లోని కావూరి హిల్స్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో జరుగుతుంది.



## దిండు వెంకటేష్ గౌడ్ పార్థివదేహానికి నివాళులు



**బాలాపూర్, జులై 18 (వన్‌నేషన్):** అనారోగ్యంతో మరణించిన బిజెపి సీనియర్ నాయకులు దిండు వెంకటేష్ గౌడ్ పార్థివదేహానికి పార్టీ కండువా కపి ఘన నివాళులర్పించిన అందెల శ్రీరాములు యాదవ్. అంతిమయాత్రలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, అర్బన్ రంగారెడ్డి రూరల్ అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి జిల్లామాజీ బిజెపి అధ్యక్షుడు బొక్క నరసింహ రెడ్డి, సరూర్నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, కాంగ్రెస్ టిఆర్ఎస్ నాయకుల పాల్గొని ఘన నివాళు లర్పించారు.

## వెస్ట్ క్రాంతి కాలనీలో వాటర్ ప్లాంట్ ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ హరి శంకర్ రెడ్డి...



**మేడిపల్లి /జులై 18 /వన్ నేషన్ :** వెస్ట్ క్రాంతి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను 25వ వార్డు మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు మాజీ కార్పొరేటర్ హరిశంకర్ రెడ్డి ని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో కాలనీ ప్రెసిడెంట్ కె. నర్సింహావైస్ ప్రెసిడెంట్ తిరుమలేష్, జనరల్ సెక్రటరీ కృష్ణస్వామి వర్కింగ్ ప్రెసిడెంట్ హీరా లాల్ నాయక్, శివరాజ్, మాజీ జనరల్ సెక్రటరీ కళ్యాణ్ క్యాషియర్ సురేందర్ రెడ్డి మరియు కమిటీ సభ్యులు రమేష్, శ్రీను, సురేష్ (రైస్ షాప్), సురేష్, పాండు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన





**మనసురాబాద్/వన్ నేషన్ :** మనసురాబాద్ సౌత్ అండ్ పార్క్ ఏరియా హాస్పిటల్ పక్కన శ్రీ రత్న క్లినిక్స్ దగ్గర జనహిత చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో డా. రూబీ జాక్సన్ ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుల సారథ్యం లో ఉచిత బి.ఎం.డి క్యాంప్ శనివారం నాడు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రూబీ జాక్సన్ మాట్లాడుతూ ఈ హెల్త్ క్యాంపు లో 90 నుండి 100 మందికి పైగా పాల్గొన్నట్లు తెలిపారు. నొప్పులకు సంబంధించిన సమస్యల గురించి సుదీర్ఘ వివరణ ఇచ్చారు. శరీరంలో ఉండాల్సిన కాల్షియం లెవెల్స్ వంటి ప్రాధాన్య గురించి రోగులకు వివరణ ఇచ్చారు. అనంతరం జనహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, సరిత క్లినిక్స్, శ్రీ రత్నా క్లినిక్స్ ఎండి అండ్ చైర్మన్ డాక్టర్ వీరబోయిన శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ మా ట్రస్ట్ ద్వారా నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుంటున్న మన్సూరాబాద్, నాగోల్ పట్టణ ప్రజలకి ధన్యవాదాలు తెలుపుతూ మా జనహిత చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఒక లక్ష మంది నిరుపేదలకి ఉచిత వైద్య సదుపాయం అందిచడమే లక్ష్యం గా అందరికి 24గంటలు అందుబాటులో ఉంటున్నామని తెలియజేశారు. మేము చేసే ఈ ప్రజారోగ్య కార్యక్రమాలకి అందరి సహాయ, సహకారాలు అవసరం అని సూచించారు. ప్రభుత్వ పాఠాశాలలో చదువు తున్న విద్యార్థిని విద్యార్థులకు మా ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కావున ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# సమగ్ర ఓటర్ల జాబితా సవరణపై పర్యవేక్షణ

**-అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి - మేడ్చల్ జిల్లా బిజెపి బిల్డర్ సెల్ కన్వీనర్ పాలకుర్తి శేషగిరిరావు పిలుపు**



**మేడిపల్లి । జులై 18 । వన్ నేషన్:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్ మేడిపల్లిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సమగ్ర ఓటర్ల జాబితా సవరణ' (ఎస్ఐఆర్) కార్యక్రమం పకడ్బందీ గా కొనసాగుతోంది. ఈ ప్రక్రియను మేడ్చల్ జిల్లా బిజెపి బిల్డర్ సెల్ కన్వీనర్ పాలకుర్తి శేషగిరిరావు స్వయంగా పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా ఆయన పలు ప్రత్యేక సహాయ కేంద్రాలను సందర్శించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. అక్కడి బి.ఎల్.ఓ (బిఎల్ఓ)లు మరియు బి.ఎల్.ఏ ( బిఎల్ఏ)లతో మాట్లాడి, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ సందర్భం గా శేషగిరిరావు మాట్లాడు తూ, "ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు మరియు బాధ్యత. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి. ఓటర్ల జాబితా సవర ణలో ఎటువంటి తప్పులు లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదయ్యేలా అధికారులు మరియు రాజకీయ పార్టీల ప్రతినిధు లు బాధ్యతగా వ్యవహరిం చాలి" అని సూచించారు.

# నేరస్థులకు శిక్షే లక్ష్యం..!!

**- కేసుల పురోగతిపై సమన్వయంతో పనిచేయాలి - అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా..**



**కర్నూలు జులై 18 డి కాసిం వన్ నేషన్ జిల్లా ప్రతినిధి :** కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఈ-ప్రాసిక్యూషన్ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేసుల దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచడం, చార్జ్‌షీట్లను సకాలంలో ఈ-ప్రాసిక్యూషన్‌లో అప్‌లోడ్ చేయడం, ఈ-కాప్స్, ఈ-సాక్ష్య యాప్‌ల వినియోగం, డిజిటల్ సాక్ష్యాల నిర్వహణ, కేసుల పురోగతిపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కోర్టుల్లో సమర్థవంతమైన ప్రాసిక్యూషన్ ద్వారా నేరస్థులకు త్వరితగతిన శిక్షలు పడేలా పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పనిచేయాలని అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా సూచించారు. అలాగే ఈ-ప్రాసిక్యూషన్, సీసీటీఎన్ఎస్, ఈ-కాప్స్, ఈ-సాక్ష్య వంటి డిజిటల్ వ్యవస్థలను పూర్తిస్థాయిలో వినియోగించడం వల్ల దర్యాప్తు, కోర్టు విచారణ మరింత వేగవంతం అవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాలోని 11 మంది అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (ఎపిపిలు), పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (పిపిలు), డీసీఆర్‌బీ సీఐ గుణశేఖర్ బాబు, కోర్టు మానిటరింగ్ సీఐ రామయ్య నాయుడు, సీసీటీఎన్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



## నోటిఫికేషన్లు ఇచ్చారు.. లీకేజీలతో అమ్ముకున్నారు

(1వ పేజీ తరువాయి)

గురించి ఒక్కనాడైనా ఆలోచించారా? అని నిలదీశారు. ప్రజా కవి అందెశ్రీ 65వ జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో రూ.4 కోట్లతో ప్రభుత్వం నిర్మిస్తున్న 'అందెశ్రీ స్మృతివనం' నిర్మాణానికి శనివారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. "బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మా పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలిచ్చింది. నిరుద్యోగుల తల్లిదండ్రుల సాక్షిగా వారందరికీ నియామక పత్రాలిచ్చాం. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత అడ్డంకులన్నీ తొలగించి గ్రూప్-1 నిర్వహించాం. ఎల్బీ స్టేడియం, శిల్పకళా వేదిక సాక్షిగా తల్లిదండ్రుల ముందు బిడ్డలకు నియామక పత్రాలు అందజేశాం. ఆ తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూశాం" అని వ్యాఖ్యానించారు. నిరుద్యోగులు మాయగాళ్ల వలలో పడవద్దని, ప్రభుత్వం ప్రతి ఉద్యోగ ఖాళీని భర్తీ చేసి నియామక పత్రాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. నిరుద్యోగిగా ఉన్న బిడ్డ కవితకు పదేళ్లపాటు పదవి ఇచ్చుకున్నారని, కానీ, శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ మీకు గుర్తు రాలేదా? అని నిలదీశారు.

## వైసీపీ వద్దే వద్దు

(1వ పేజీ తరువాయి)

22 నుంచి 24వ తేదీ వరకు తల్లికి వందనం పథకంలో 67,47,140 లక్షల మంది విద్యార్థులకు రూ.10,122 కోట్ల నగదును తల్లుల ఖాతాలలో జమ చేస్తామన్నారు. అంగన్వాడీ, స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో పని చేసే సిబ్బందికి తల్లికి వందనం జమ చేస్తామని చెప్పారు. 'ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్రా-స్వర్ణ ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొంటున్నాను. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఆరోగ్యం, శుభ్రత కూడా అవసరం. ప్రజలు పూర్తిస్థాయిలో సహకరిస్తేనే స్వచ్ఛతా లక్ష్యం నెరువేరుతుంది. రోడ్లు ఊడ్చుటమే పరిశుభ్రత కాదు. స్వచ్ఛ ఆంధ్రా ఉద్దేశం ఇది కాదు.

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**